విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె. ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, బందోబస్త్ ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎం. కె. మీనా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.ఏలూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి వె. ప్రసన్న వెంకటేష్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటుహక్కు వినియోగించుకునే ప్రజాప్రతినిధులకు గుర్తింపు కార్డులు, ఓటర్ స్లిప్ లు అందిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా 8 మంది డిఎస్ పి లు, 10 మంది సిఐ లు, 230 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్త్ ప్రణాళిక రూపొందించామన్నారు. సెబ్ అదనపు ఎస్పి నక్కా సూర్యచంద్రరావు, ఆర్డీఓలు పెంచెల్ కిశోర్, ఝాన్సీరాణి, జిల్లాపరిషత్ సీఈఓ కె. రవికుమార్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్. బాలకృష్ణన్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ, డ్వామా పీడీ రాంబాబు, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, ప్రభృతులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌తో సృజనాత్మకత పెంపు

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: సైన్స్ ఫెయిర్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తుం దని విద్యా శాఖ ఆర్‌జెడి జి. నాగమణి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ ఆర్ ఆర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న సైన్స్ ఫెయిర్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ అందించిన ల్యాప్‌టాప్‌లు విద్యార్థులు ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.4 లక్షల విలువైన సోలార్ సిస్టంను పాఠశాలకు ఇచ్చిన ఎస్ ఆర్ ఆర్ పాఠశాల పూర్వపు విద్యార్థులను ఆర్జేడి అభినందించారు.

టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : టైలర్ల అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నుకోబడిన కొయ్యలగూడెం మండల టైలర్స్ సంఘ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు పేర్కొన్నారు. టైలర్స్ డే ను పురస్కరించుకొని కొయ్యల గూడెం మండలంలో ఉన్న రెండు టైలర్స్ సంఘాలను ఒకటిగా చేసి విలియం హెూ శ్రీ గణపతి రామ టైలర్ సేవా సంఘంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొయ్యలగూడెం మండల ట్రైలర్స్ అధ్యక్షుడిగా తాడిగడప ఆంజనేయ రాజును నూతనంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండలంలో ఉన్న టైలర్ సోదరులందరూ తనను అధ్యక్షునిగా ఎన్నుకోవడం సంతోషకరంగా ఉందని టైలర్ల అభివృద్ధికి, ప్రభుత్వం ద్వారా వచ్చే వివిధ పథకాలు ట్రైలర్ల అందరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెప్పుల మధుబాబు, సంకు కృష్ణ, వెంకటరత్నం, చంద్రశేఖర్, ఆంజనేయులు ,అప్పలరాజు, యెషయా, ఇద్రిష్,నాగార్జున, స్వామి టైలర్ ,గంగోత్రి టైలర్ ,లక్ష్మీ టైలర్స్ ,తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం బస్టాండ్ వద్ద బుధవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. దాతలు ఎస్ ఎస్ మోటార్స్, కుశలవ ఎలక్ట్రికల్ బైక్ షోరూం అధినేతలు గుణ్ణం సురేష్ బాబు, వెజ్జు సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద, దాత బళ్ళ త్రిమూర్తులు, సర్పంచ్ దిడ్ల అలకనంద శ్రీనివాస్, ఉపసర్పంచ్ అడపా శ్రీనివాస్, పాతూరి సత్యనారాయణ , సప్పా వీరబాబు, నేకూరి ఆశీర్వాదం, నల్లా ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డి.ఆర్.జి. కళాశాల తెలుగు విభాగాధిపతికి రచయితల సంఘం అవార్డు

విశాలాంధ్ర-పెంటపాడు: స్థానిక డిఆర్జి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ సుంకర గోపాల్‌కి పెన్నా రచయితల సంఘం అవార్డు లభించింది. ఆయన రచించిన మా నాయినపాట అనే కవితా సంకలనానికి ఈ అవార్డు లభించింది. ఇది జాతీయ స్థాయిలో నిర్వహించే కవిత సంకలనాల పోటీ గత 14 సంవత్సరాల నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి అవార్డు. డాక్టర్ సుంకరగోపాల్ కి రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు, ఇతర అధ్యాపక అధ్యాపకేతరసిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అవార్డుకు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్, ప్రముఖ కవయిత్రి మందరపుపు హైమావతి, న్యాయ నిర్ణేతలుగాతలుగా వ్యవహరించినట్లు పెన్నా అవార్డు కమిటీ అధ్యక్షులు అవ్వారు శ్రీధర్ బాబు తెలియజేశారు. మా నాయినపాట అనే కవితా సంకలనానికి అవార్డ్ లభించింది. ఈ పుస్తకానికి ఇది నాలుగో అవార్డ్.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-ఉండి: రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం అని వైసిపి సోషల్ మీడియా జిల్లా కో-ఇన్‌చార్జి పాటూరి దొరబాబు అన్నారు. మండల కేంద్రమైన ఉండిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రైతులందరూ రైతుల పెన్నిధి ముఖ్యమంత్రి జగన్‌కు ఆశీస్సులు అందించాలని కోరారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన వ్యక్తి జగన్ అని తెలిపారు. వైయస్సార్ రైతు భరోసా పథకంలో భాగంగా ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడున్నర సంవత్సరాలలో రూ.27 వేల కోట్లకు పైగా రైతులకు ఆర్థిక సాయం అందించామన్నారు. మాండూస్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీతో కలిపి రూ.1912 కోట్లను ఇవ్వడం జరిగిందని వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల కోసం నూటికి నూరు శాతం బీమా ప్రీమియాన్ని భరిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు.

సుస్థిర అభివృద్ధి సాధనకు పని చేయాలి

- ప్రతి అర్జీని నిర్ణీత గడువులో పరిష్కరించినందుకు అభినందనలు
- రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్

విశాలాంధ్ర-ఏలూరు: స్పందనలో అందిన సమస్య మనదే అన్న దృక్పథం కలిగిన విధంగా అధికారులు పనిచేస్తే తప్పక సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి జీ.ఎస్ ఆర్ కె ఆర్ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఏలూరు ఆశ్రం ఆస్పత్రి మినీ ఆడిటోరియంలో ఏలూరు,పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, పోలీసు, క్షేత్రస్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్పందన కార్యక్రమాల పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మానవ అభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలన్నారు. ఏ పని ఎవరి కోసం చేస్తున్నాం, ఎందుకోసం చేస్తున్నాం అని ఆత్మావలోకనం చేసుకోవాలన్నారు. నిజమైన అభివృద్ధికోసం పని చేస్తున్న అవకాశం వచ్చినందుకు అదృష్టంగా భావించి ఇష్టంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ముందుగా ఎస్.డి.జి లక్ష్యాలను ఎందుకు పెట్టవలసి వచ్చింది, వాటి ఉద్దేశ్యాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలను పలు సూచికలుగా నిర్దేశించిందన్నారు. సమీకృత అభివృద్ధికి లక్ష్యాల సాధనకు ప్రపంచ వ్యాప్తంగా 8 అంశాలు, 18 లక్ష్యాలు, 56 సూచికలతో ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా సామాజిక, ఆర్థిక, పర్యావరణ, పీస్ అండ్ పార్టనర్షిప్ అంశాలు ఉన్నాయని తెలిపారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించినందుకు రెండు జిల్లాల కలెక్టర్లైనా వె. ప్రసన్న వెంకటేష్ పి .ప్రశాంతి లను సెక్రటరీ విజయ్ కుమార్ అభి నందించారు. ప్రజల అవసరాలను గుర్తించడంలో , వాటిని సకాలంలో నెరవేర్చడం లో ప్రభుత్వం చిత్త శుద్ధి తో ఉందని అన్నారు. తొలుత ఏలూరు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే సమయంలో కోవిడ్ పరిస్థితులలో లాక్ డౌన్, మరణాలు సంభవించ డంతో అభివృద్ధి కొంత కుంటుపడింద న్నారు. మళ్ళీ ఈ లక్ష్యాలను సాధించేం దుకు రెట్టింపు స్థాయిలో గురి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి . ప్రశాంతి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల ద్వారా లక్ష్యాలు సాధిస్తున్నప్పటికీ సంబం ధిత వివరాలు డేటా ఎంట్రీ చేయక పోవడం వల్ల ఆన్లైన్ లో ప్రగతి ప్రతిబింబించడం లేదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పట్టణ పరిపాలనా శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ పురపాలనలో స్పందన, కాలుష్య నియంత్రణ తదితర అంశాలకు సంబంధించి ఎస్.డి.జి. లక్ష్యాలను వివరించారు. చివరిగా ఏలూరు జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు మాట్లాడుతూ ఎస్.డి.జీల పై ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ్ కుమార్, మునిసిపల్ పరిపాలన శాఖ కమీషనర్ ప్రవీణ్ కుమార్, ఇతర రిసోర్స్ పర్సన్స్ వివరించిన అంశాలు అత్యంత విలువయినవని, వాటిని గుర్తించి ఎస్.డి.జి. సూచీల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం. సూర్యతేజ, సబ్ కలెక్టర్లు ఆదర్శ్ రాజేంద్రన్, డి.ఆర్.ఓలు ఏ.వి. ఎస్ .ఎస్. మూర్తి, కె. కృష్ణకుమారి, రెండు జిల్లాల ఆర్.డి.ఓ లు, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు,తహాసిల్దార్లు, ఎం.పి.డి.ఓ లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పటిష్టం చేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: భవననిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన వెల్ఫేర్ బోర్డ్ ను పటిష్టంచేసి సక్రమంగా పని చేయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. తాడేపల్లి గూడెం మండలం మాధవరం గ్రామ భవన నిర్మాణ కార్మికసంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.బుధవారం స్థానిక శివాలయం వద్ద జరిగిన సమావేశానికి గ్రామ సంఘం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. డి.సోమసుందర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న వెల్ఫేర్ బోర్డ్‌ను మనరాష్ట్రంలో ఇటీవల నీరుకార్చ డం బాధాకరమని అన్నారు. భవననిర్మాణ కార్మికులు పెట్టుకున్న దరఖాస్తులు వెల్ఫేర్ బోర్డులో మూడేళ్ళుగా పడి ఉన్నాయని, దీనిపై కార్మికులు పోరాటం సాగించాలని అన్నారు.వెల్ఫేర్ బోర్డ్ ద్వారా భవననిర్మాణ కార్మికులకు పింఛను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలి ఆదినారాయణ మాట్లాడుతూ కార్మిక సంఘాలు పోరాటం ద్వారా సత్తా చూపితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. జిల్లా యూనియన్ కార్యవర్గసభ్యుడు పిల్లంగోళ్ళ కృష్ణ ,మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, గ్రామ సంఘం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సిద్దిరెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గండ్రోతు హనుమంతు, కోశాధికారి ఇంటి కనకరాజు, కమిటీ సభ్యులు అడబాల సూర్య చంద్రరావు, తెలగారెడ్డి సత్యనారాయణ, లక్కాకుల చిన్న తదితరులు మాట్లాడారు.ఎల్. అగ్రహారం గ్రామ భవననిర్మాణ కార్మికసంఘం సమావేశం ఎల్ అగ్రహారం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామసంఘం అధ్యక్షుడు పాలూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, జిల్లాసంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, జిల్లాకమిటీ సభ్యులు కోడె సాయిబాలాజీ, పిల్లంగొళ్ళ కృష్ణ, గ్రామ సంఘం ఉపాధ్యక్షుడు దంగేటి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి దయ్యం పాండురంగారావు, సహాయ కార్యదర్శి బసివిరెడ్డి సురేష్, తదితరులు మాట్లాడారు.

4న భీమవరంలో ఐఎల్ 5వ జిల్లా మహాసభలు

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 4వ తేదీ ఉదయం 10గంటలకు డిఎన్నార్ న్యాయ కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఐఎల్ 5వ మహాసభలు నిర్వహించనున్నట్లు ఐఎల్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు చెల్లబోయిన రంగారావు తెలిపారు. బుధవారం ఆయన భీమవరంలో ఐఎల్ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ మహాసభల్లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.వి.శేషసాయి, జస్టిస్ వి.ఆర్.కె.కృపాసాగర్, బి.వి.ఎల్.ఎన్.చక్రవర్తి పాల్గొని తమ అమూల్య సందేశాలిస్తారన్నారు. గౌరవ అతిథులుగా ఐఎల్ రాష్ట్ర నాయకులు హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, ముప్పాళ్ల సుబ్బారావు, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ పాల్గొంటారని వివరించారు. మహాసభల విజయవంతం కావడానికి ఐఎల్ సభ్యులందరూ కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఎల్ నాయకులు నెక్కంటి క్రాంతి కుమార్, వై.వి.ఆనంద్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులు చట్టాల అమలుకు పోరాడాలి

విశాలాంధ్ర -కైకలూరు : భవన నిర్మాణ కార్మికులు చట్టాల అమలు కోసం పోరాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం స్థానిక కార్యాలయంలో అంకెం త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నారపల్లి రమణారావు మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు ఏళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ఒక్క చట్టం అమలు జరగడం లేదన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలలో భవన నిర్మాణ కార్మికులకు ఎంతో కొంత చట్టాలు అమలు చేస్తున్నాయని మన రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఇసుక కొరత సృష్టించి నిర్మాణరంగం మెటీరియల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి నిర్మాణరంగం కుదేలైపోయేలా చేశారన్నారు. ఈ సమావేశంలో నాగిరెడ్డి కొండలరావు. కన్నా శ్రీనివాసు పట్టుపు అచ్చయ్య నాగిరెడ్డి శ్యామలరావు తదితరులు మాట్లాడారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: ప్రజలకు విద్యుత్ కొరత, లో వోల్టేజ్ లేకుండా ఉండడం కోసం కొయ్యలగూడెం పట్టణంలో నూతనంగా 3 విద్యుత్ ట్రాన్స్ఫర్మర్లను ఏర్పాటు చేసి కొత్త లైన్లను కూడా నిర్మించడం జరుగుతుందని గవరవరం విద్యుత్ ఉపకేంద్ర ఏఈ రామారావు పేర్కొన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు కరెంటు కొరత లేకుండా ఉండడం కోసం నూతన ట్రాన్స్ఫర్లను ఏర్పాటు చేస్తున్నామని రామారావు తెలిపారు.

నేడు సీపీఐ మహాధర్నా విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ఉండి: జగనన్న గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో జరగనున్న మహాధర్నా విజయవంతం చేయాలని సీపీఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు కోరారు. బుధవారం ఉండి సీపీఐ కార్యాలయంలో మహాధర్నా గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1 లక్ష80వేలు పెరిగిన గృహ నిర్మాణ సామాగ్రి ధరలతో ఎంతమాత్రం సరిపోక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు.పెరిగిన ధరలకను గుణంగా జగనన్న గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని, టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలని, ఇసుక, సిమెంటు, ఇనుము ఉచితంగా లబ్ధిదారులకు అందజేయాలని, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలకు ఇవ్వాలని కోరుతూ విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాధర్నాలో జగనన్న, టిడ్కో గృహాల లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సనపల శ్రీను, కోన గొల్లయ్య, పతివాడ గణపతి, షేక్ బాజీ, కొండ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజర్ డాక్టర్ ఎస్.ఎం.అరుణ్ ప్రకాష్ సూచిం చారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎమ్.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో బీటెక్ విద్యార్థులకు కెరీర్ పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథి అరుణ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. సాధించాలనే తపన, పట్టుదలతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చని తెలియజేశారు. ఆధునిక డిజిటల్ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేలా అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినేష్‌లో ఏ ఏ కోర్స్ లు ఉంటాయి, విద్యావిధానం ఎలా ఉంటుంది, స్కాలర్ షిప్ లకు దరఖాస్తు ఎలా చేసుకోవాలి వంటి విషయాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సంస్థ లోని ప్లేస్ మెంట్ సెల్ విభాగాదిపతి డాక్టర్ కార్తికేయ శర్మ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని దేవులపల్లి ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనాన్ని ఢీ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో వాహనంపై ప్రయాణిస్తున్న ఆవుల వెంకన్న అక్కడికక్కడే మృతి చెందారు. ఏడుకొండలు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఏడుకొండలును స్థానికులు 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ కు తరలించారు. మృతుడు ఆవుల వెంకన్నచింతలపూడి కి చెందిన యువకుడుగా గుర్తించారు. ఏలూరులో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణం గానే వెంకన్న చనిపోయాడని ఆరోపిస్తూ దేవులపల్లి లో బస్సులను అడ్డుకుని మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు.దీంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది.జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ సంఘటనా స్థలానికి వచ్చి సమాధానం చెప్పాలని మృతుని బంధువులు డిమాండ్ చేస్తున్నారు . కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో లక్కవరం పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. బస్ డ్రైవర్ లక్కవరం పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. లక్కవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం గ్రామానికి చెందిన **తాతా సుబ్బారావు (తండ్రి) బ్రాహ్మన్నకు** చెందిన ఇంటి సర్వే నంబర్189/1లో **డాక్యుమెంట్ నెంబర్ 4401/2011లో** 242 గజాల భూమి కలదు. ఈ భూమి తాలూకా ఇంటి దస్తావేజులు సుబ్బారావు నరసన్న పాలెం గ్రామం నుంచి కొయ్యలగూడెం బ్యాంక్ పని నిమిత్తం వచ్చి మార్గంలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

తాతా సుబ్బారావు (తండ్రి) బ్రహ్మన్న,
నరసన్న పాలెం గ్రామం,
కొయ్యలగూడెం మండలం,
ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ నెంబర్:7997275408.

పొలం దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన **చిన్నం వెంకట అప్పారావు (తండ్రి) సూర్యారావు, అప్పారావు** కు చెందిన సర్వేనెంబర్ 405/1 లో **డాక్యు మెంట్ నెంబర్1878/2020** లో 1 ఎకరం 89 సెంట్లు భూమి కలదు. వెంకట అప్పారావు పొలం దస్తావేజులు తీసుకొని బయ్యనగూడెం గ్రామం నుంచి కొయ్యలగూడెం వచ్చు మార్గంలో పడిపోయినవి దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

చిన్నం వెంకట అప్పారావు
(తండ్రి) సూర్యారావు,
బయ్యనగూడెం గ్రామం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
ఫోన్ నెంబర్:8885669926.

ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం ప్రారంభం

విశాలాంధ్ర -ఏలూరు : ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు న్యాయ సేవాధికార సంస్థ భవనంలో బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం చైర్ పర్సన్‌గా ఎ. మేరీగ్రేస్ కుమారి బాధ్యతలు చేపట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం చైర్‌పర్సన్ ఎ. మేరీ గ్రేస్ కుమారి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2002వ సంవత్సరంలో న్యాయ సేవాధికార సంస్థ చట్టం 1987 సవరణ ద్వారా ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం చట్టాన్ని అమలులోకి తెచ్చిందని తెలిపారు. దీని ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రజలు ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారి సమస్యలు కోర్టులో వేయకుండా ఉన్నవారికి నేరుగా ఈ న్యాయ పీఠాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు. వీరికి న్యాయపరంగా ఉచితంగా సమస్యను పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ ప్రజాప్రయోజనాలు శాశ్వత న్యాయ పీఠాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని సుఖవంతమైన జీవితాన్ని గడపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మేరీ గ్రేస్ కుమారికి ప్రముఖ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు.

భావి అవసరాలకు నైపుణ్యం తప్పని సరి

విశాలాంధ్ర-కుక్కునూరు : విద్యార్థుల భావి అవసరాల కోసం వ్యవస్థాపన నైపుణ్యం నేర్చుకోవాలని రాష్ట్ర పరిశోధన సమగ్ర శిక్షా శిక్షణా జిల్లా మేనేజర్ ఎం. వెంకటరమణ పేర్కొన్నారు. కుక్కునూరు కస్తూర్బా బాలికల విద్యాలయంలో జరిగిన 'ఎంటర్ ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు వర్క్‌ను పరిశీలించి అభినందించారు. పాఠశాల స్థాయిలోనే వ్యవస్థాపక మనస్తత్వం నైపుణ్యాలు పెంపొందించుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన సూచించారు.

నాచుగుంటలో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయి

విశాలాంధ్ర-ఉంగుటూరు ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీలో ఎల్ఈడి వీధిలైట్లు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. విద్యుత్తును పొదుపుగా వాడండి అని విద్యుత్ శాఖ నినాదాలు ప్రకటనకే పరిమితమవుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. పగలే వీధి లైట్లు వెలుగుతున్నా పంచాయతీ, విద్యుత్తు శాఖ పట్టించుకోవట్లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగలు వీధిలైట్లు వెలగకుండా చూడాలని కోరుతున్నారు. మండలంలో అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి ఉంది.

ఓటరు వెరిఫికేషన్

విశాలాంధ్ర-కుక్కునూరు : మండల కేంద్రమైన కుక్కునూరులో బుధవారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముల్లిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలు వార్డుల్లో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు ఓటర్ల జాబితాలో ఉందో లేదో చూసుకోవాలని తెలిపారు. ఓటు అనేది మనకు ఓ ఆయుధం లాంటిదని అలాంటి ఓటును నేటి పాలకులు వారి స్వార్థం ప్రయోజనాల కోసం తొలగించే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, కుక్కునూరు ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, ఐటిడిపి జిల్లా అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, కుక్కునూరు మురళీమోహన్, సీనియర్ నాయకులు లంకాల రాజు, యూత్ నాయకులు అంగిరేకుల బాలాజీ,వేణు, విలాసాగరపు రాంబాబు, కొవ్వాసి నాగార్జున, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలు వేసవిలో జాగ్రత్త తీసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి.హెచ్. అగ్రహారం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు ఓ ఆర్ ఎస్ ద్రావణం వలన కలిగే లాభం కోసం ఆరోగ్య సహాయకుడు నామాల రాజు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వేసవి కాలంలో వడ దెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ ఉదయం 11 గం.ల తరువాత బయటకు వెళ్ల కూడదని అత్యవసర మైతే ఎండ తగలకుండా గొడుగు,నీరు, కాళ్ల కు చెప్పులు ధరించాలని వివరించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుక్క అప్పారావు ,శేష వేణి, ఏఎన్ఎం యం. ఏసమ్మ, ఆశ కార్యకర్త పి.దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేయటానికి వెనకడుగు

- నిధులున్నా చేసిన పనులకు ఇవ్వని దుస్థితి
- లింగపాలెం మండల పరిషత్ నిధులగాధ

విశాలాంధ్ర - లింగపాలెం : నిధులున్నా చేతికి రాని పరిస్థితి లింగపాలెం మండల పరి షత్‌లో నెలకొంది. మండల పరిషత్‌లో దాదాపు రూ. 1 కోటి నిధులున్నాయి. వీటిలో పలు అభివృద్ధి పనుల కోసం జనరల్ బాడీ సమావేశంలో ఆమోదిస్తూ తీర్మానాలు చేశారు. పనులు మంజూరు చేసి ఆరు నెలలు అయ్యింది. కాని పనులు జరగటంలేదు. ఈ మండలంలో మండల పరిషత్ నిధులు నుంచి అభివృద్ధి పనులు చేసి మూడేళ్ళు దాటింది. 2019 జూలైలో పాలకవర్గం పాలన ముగిశాక 2021 సెప్టెంబరు వరకు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో మండల పరిషత్ కొనసాగింది. ఈ సమయంలో వరుసగా రెండేళ్ళు కరోనా, కొన్ని సాంకేతిక కారణాలతో ఎటువంటి అభివృద్ధి పనులు జరగకపోవటంతో నిధులు పెద్దగా ఖర్చుకాలేదు. 2021 సెప్టెంబరులో కొత్త పాలకవర్గం ఏర్పడే నాటికి దాదాపు రూ. 1 కోటి నిల్వ ఉంది. జనరల్ ఫండ్స్‌తోపాటు, 15వ ఆర్థిక సంఘ నిధులు మండలంలో ఉన్నాయి. ఉన్న నిధులతో గ్రావెల్, సిమెంటు రహదారులు, డ్రెయిన్లు, మండల పరిషత్‌కు సంబంధించిన 40 అభివృద్ధి పనులు కోసం నిధులు కేటాయించారు. మండల పరిషత్‌కు ఉన్న 17 ఎంపిటిసిల పరిధిలో అభివృద్ధి పనులు చేయటానికి నిధులు మంజూరు చేశారు. మంజూరు చేసిన పనుల్లో వేములపల్లిలోని దళితవాడలో 120 మీటర్ల సిమెంటు రహదారిని, ఆశన్నగూడెంలో రూ. 3 లక్షలతో మూడు కిలోమీటర్ల గ్రావెల్ రహదారిని, ముడిచర్లలో రూ. 5 లక్షలతో రెండు కిలోమీటర్లు గ్రావెల్ రహదారిని, నరసన్నపాలెం పంచాయతీలో రూ. 50 వేలతో మంచినీటి బోరుకు మోటారును అమర్చటం, పాచ్చానగరంలో రూ. 5 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం, కొణిజర్లలో రూ. 3 లక్షలతో పంచాయతీ కార్యాలయంలో స్టోర్‌రూమ్ నిర్మాణపు పనులను పూర్తి చేశారు. వీటిలో కొణిజర్లలో చేసిన పనికి రూ. 3 లక్షలు మాత్రమే ఇచ్చారు. మిగతా పనులకు పైసా రాలేదు. దీంతో పనులు చేసిన వారంతా ఆందోళనతో ఉన్నారు. నిధులు రాకపోవటంతో మిగతా పనులు చేయటానికి ఎవరూ సాహసించటంలేదు. ఖజనా కార్యాలయంలో లింగపాలెం మండల పరిషత్‌కు చెందిన నిధులు ఉన్నట్టుగా ఉందని, కాని డ్రా చేస్తుంటే రావటంలేదని పనులు చేసిన వారు అంటున్నారు. ఇలా అయితే మిగిలిన పనులు ఎలా చేయాలనే నిరుత్సాహంతో ప్రజాప్రతినిధులు ఉన్నారు. నిధులున్నా చేసిన పనులకు డబ్బులు అందని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

చెస్‌లో అండర్ - 17 రాష్ట్రస్థాయి ఎంపికలు

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక తంగెళ్ళమూడిలోని సిదార్థ విద్యాలయ స్కూలులో ఏలూరు జిల్లా, అండర్-17 చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో జి.అభిషేక్ అబ్రహాం ప్రథమ, కె.ఓంకార్ ద్వితీయ, నిహాల్‌వర్మ తృతీయ, సి.హెచ్.వివేక్ చతుర్థ స్థాయి బహుతులు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తపనా ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కన్వీనర్ వాసుదేవరావు, చెస్ అకాడమి డైరెక్టర్ జి.యోహనన్, వై.మహేష్, కిరణ్‌కుమార్, జి.స్వరూపరాణి, జి.హదిస్సా అరుణ, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో ఆరుగురు ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: అపోలో ఫార్మసీ, మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ గణపవరం వారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆరుగురు అభ్యర్థులు ఎంపికైనట్లు శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 11 వేల రూపాయలు వేతనం ఉంటుందని ఆమె అన్నారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు కళాశాల జెకెసి కోఆర్డినేటర్ పి. మధురాజు, కళాశాల నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ టి అక్కిరాజు, ఐవిఎల్ఆర్‌కే ప్రసాద్‌లను కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల కుమారి అభినందించారు. భవిష్యత్తులో జరిగే క్యాంపస్ ఇంటర్వ్యూలో కళాశాల నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఎంపిక అవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డివివి చిన సత్యనారాయణ, అధ్యాపక, అధ్యాపకు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వీరవల్లికి మద్దతు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన వీరవల్లి చంద్రశేఖర్‌కు జిల్లా పంచాయతీ ఛాంబర్ తరఫున మద్దతు తెలియ జేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సలహాదారులు పిల్లి సత్తిరాజు, జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు కడలి గోపాలరావు తెలిపారు. నగరంలోని ప్రైవేటు హోటలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని వ్యవస్థను బలోపేతం చేసేందుకు తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. పార్టీలకు వ్యతిరేకంగా పనిచేస్తామని పంచాయతీరాజ్ ఛాంబర్ లో అన్ని పార్టీలకు సంబంధించిన సభ్యులు ఉన్నారని తెలిపారు.పిల్లి సత్తిరాజు మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున పోటీ చేసిన నలుగురిలో ఒకరిని మద్దతుగా ఎన్నుకున్నామని కేవలం రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలకు వ్యతిరేకంగా పంచాయతీరాజ్ ను బలేపేతం చేయడానికి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కడలి గోపాలరావు మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పిటిసి, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ లకు గౌరవ వేతనాలు పెంచే వీలుగా తాము ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని నిలబెడుతున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న సభ్యులంతా వీరవల్లి చంద్రశేఖర్ని బలపరచాలన్నారు. మిగిలిన సభ్యులంతా వీరవల్లి చంద్రశేఖర్ ను బలపరిచేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేస్తామని తెలిపారు.

5న భోగేశ్వరస్వామి వారికి 16 రోజుల పండుగ

విశాలాంధ్ర - కలిదిండి: ఈనెల 5న పాతాళ భోగేశ్వర స్వామి వారి సన్నిధిలో భోగేశ్వర స్వామి వారికి 16 రోజుల పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. కలిదిండి శివారు భోగేశ్వర లంకలో స్వయంభుగా కొలువైన శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారి వార్షిక మహాశివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగించుకొని ఈనెల 5వ తేదీ ఆదివారం స్వామివారి సన్నిధిలో ఆలయ చైర్మన్ అడవి వెంకట గంగాధర్ శర్మ మరియు ధర్మకర్తల మండలి పరివేక్షణలో 16 రోజుల పండుగ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, పూర్ణాహుతి అనంతరం దాతలు సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తునట్లు తెలిపారు. భక్తులు అత్యధికంగా విచ్చేసి స్వామివారి దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించి 16 రోజుల పండగను విజయవంతం చేయలని కోరారు.

శ్రీ జగదాంబ అమ్మవారిని దర్శించుకున్న పొన్నాల అనిత

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: శ్రీ జగదాంబ అమ్మవారిని ఉత్సవాలు పురస్కరించుకొని బుధవారం మాజీ మంత్రి కీ.శే. కోటగిరి విద్యాధరరావు తనయురాలైన పొన్నాల అనిత దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు గరగ నృత్య వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏట ఉత్సవాలు జరిగేటప్పుడు అమ్మవారిని దర్శించుకుంటానని ఆమె తెలిపారు జగదాంబ అమ్మవారు అంటే నాకు ప్రత్యేకమైన ఇష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ చాట్రాతి భవాని శేఖర్, వైస్ చైర్మన్ చిట్టి బొమ్మ సతీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరమ్మ ఉత్సవాలు

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెంలోని ప్రఖ్యాతిగాంచిన సరమ్మ ఉత్సవాలు బుధవారం ప్రారంభ మయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 12 వరకు జరుగుతాయి. అమ్మవారి ఊరేగింపు ఐదు రోజులపాటు జరుగుతుంది. ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రతీరోజు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల సదుపాయం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

లిటిల్‌బడ్స్ స్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక పడమర వీధిలోని లిటిల్‌బడ్స్ స్కూలులో సైన్సు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు చేసిన సైన్సు నమూనాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు సైన్సు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల గురించి వారు పొందిన నోబుల్ బహుమతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-తణుకు: పట్టణం లోని 2వ వార్డుకు చెందిన నక్క వెంకటేశ్వరరావు కుమారుడు నక్క మను అనే దివ్యాంగుడుకి తణుకు పట్టణం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పంతం నానాజీ ఆర్థిక సాయంతో బుధవారం తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు చేతులమీదుగా వీల్ చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తణుకు పట్టణ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, తణుకు మండలం అధ్యక్షులు చిక్కాల వేణు,ఇరగవరం మండలం అధ్యక్షులు ఆకేటి కాశి కేశవ, నాలుగో వార్డ్ జనసైనికులు పవన్ కుమార్, మహమ్మద్ రియాజ్, చింతపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచుకోవాలని ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో బుధవారం మదన గోపాల స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన పరింపూడి గ్రామపంచాయతీకి పిఎసిఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు తల్లి మంతెన సూర్యవతి జ్ఞాపకార్థంగా ట్రాక్టర్ను అందజేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, ఎంపీ కోటగిరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చినబాబు, వైసిపి నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టార్టప్ ఏర్పాటులో అగ్రస్థానంలో నిలవాలి

విశాలాంధ్ర -భీమవరం: స్టార్టప్ ఏర్పాటులో ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ పేర్కొన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్ కు చెందిన పలువురు విద్యార్థులు డాక్టర్ ఎం.సురేష్ బాబు పర్యవేక్షణలో భీమవరం ఆన్ లైన్ క్యాంపస్ కేఫ్ బై ఎస్.ఆర్.కె.ఆర్. ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థి రాజశేఖర్ పర్యవేక్షణలో అంధుల కోసం స్మార్ట్ విజన్ బై ఎస్ ఆర్ కె ఆర్ అనే స్టార్టర్‌ను టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో రూపొందించారు. రెండు స్టార్టప్పులకు ఇటీవల ఎన్ ఐ టి తాడేపల్లిగూడెంలో జరిగిన వాల్కాన్సి ఫెస్ట్- 23 లో రెండు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో నిశాంత్ వర్మ విద్యార్థులను టెక్నాలజీ సెంటర్ హెడ్స్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు దేశం నలుమూలల జరిగిన పలు హేకతాన్ పోటీల్లో ప్రథమ ద్వితీయ స్థానాలు పొంది దేశంలోనే కళాశాలకు ఒక ప్రత్యేక స్థానం కల్పించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, సి ఎస్ డి విభాగం హెడ్ డాక్టర్ ఎం. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దుబాయిలో ప్రపంచ పద్మశాలి సమ్మిట్

విశాలాంధ్ర - తణుకు : దుబాయ్‌లో ఈ నెల 26,27 తేదీల్లో ఎన్ఏపిఏ వారి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ పద్మశాలిల సమ్మిట్ కార్యక్రమానికి మాజీ చేనేత కార్పొరేషన్ చెర్మన్ వావిలాల వెంకట రమేష్ సరళా దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వావిలాల సరళా దేవి మాట్లాడుతూ ఇంత మంది పెద్దలు పాల్గొన్న ఈ సభలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. దాదాపు 15 దేశాల ప్రముఖులు పాల్గొన్న ఈ సభకు తనను ఎంపిక చేసి అతిథి గా ఆహ్వానించి నా కంటూ ప్రత్యేక గుర్తింపు గౌరవాన్ని ఇచ్చిన ఈ ఆర్గనైజేషన్ లో వర్క్ చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.పద్మశాలి ల ఉనికిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పద్మశాలి లకు ఉన్నత మైన పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. అనంతరం వావిలాల వెంకటరమేష్ సరళాదేవి దంపతులను ఆర్గనైజేషన్ సభ్యులు హరి, గుత్తికొండ రవిచంద్రా, మహిళా కమిటీ అధ్యక్షులు సరస్వతి తదితరులు శాలువాతో మెమెంటోతో సత్కరించారు. ఈ సభలో దేశవిదేశాల్లో పెద్దలు పద్మశాలి ల ఐక్యతా. ఆర్థిక. సామాజిక. రాజకీయ ప్రయోజనాల.అభివృద్ధి వంటి అంశాల పై చర్చించారు. అనంతరం పద్మశాలి లోగో ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ ఎల్.రమణ,మాజీ ఎమ్మెల్యే రాములు, ఎన్ఏపిపి సృష్టి కర్త, మాజీ మంత్రి గుండు సుధారాణి, ఆంధ్రా నుంచి ఆప్కో చేనేత కార్పొరేషన్ చైర్మన్ జి.చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాస్,అఖిల భారత పద్మశాలి అధ్యక్షులు కందగట్ల స్వామి, వైజాగ్ నుంచి ప్రొఫెసర్ కల్యాణి,ఆంధ్ర కోఆర్డినేటర్ పంచుమర్తి భీమేష్, ఆకుల నాగేశ్వరరావు.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీదారులకు బెల్లం అమ్మరాదు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా తయారు చేసే వ్యక్తులకు వ్యాపారస్తులు బెల్లం అమ్మ రాదని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ అన్నారు బుధవారం ఎస్ ఈ బి పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని బెల్లం వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్, ఎస్ ఈ బి అడిషనల్ ఎస్పీ, ఏటీవీ రవికుమార్ ఆదేశాల మేరకు వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించామని తెలిపారు నాటుసారా తయారు చేసే వ్యక్తులకు బెల్లం అమ్మ రాదని, ఎవరికైనా అధిక మొత్తంలో బెల్లం వారి అవసరాలు నిమిత్తం అమ్మ వలసి వస్తే వారి నుంచి సరైన ధ్రువ పత్రాలు కాపీలు తీసుకొని అమ్మ వలసినదిగా వ్యాపారాలకు సూచించారు అపరిచిత వ్యక్తులు వ్యాపారం చేయనివారు ఐదు కేజీల నుంచి బెల్లం కొనుగోలు చేస్తే వారి సమాచారం అందించాలని సూచించారు నాటు సారా తయారీలో బెల్లం ముడి సరుకు అని తెలిపారు వ్యాపారస్తులు దానిని కట్టడం చేస్తే నాటుసారా తయారీ నిలిచిపోతుందని అన్నారు. ఈ సమావేశంలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఈత కోట తాతాజీ, ఉపాధ్యక్షులు కొవ్వూరి నాగేంద్ర రెడ్డి, బెల్లం వర్తకులు, ఎస్ఈబి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ గంజిమల రామారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంజిమల రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రామారావు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని, మండలంలో ఏ సమస్య ఉన్నా తనకు నేరుగా వచ్చి తెలియజేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజాక్షి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ బాజీ, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21వరకు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర-ఏలూరు: జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింట సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా అదనపు వైద్యాధికారిణి ఎయిడ్స్ లెప్రసీ, టిబి డాక్టర్ జి. రత్నకుమారి తెలిపారు .ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు వైద్యాధికారిణి డా.జి . రత్నకుమారి గజ్జెలవారిచెరువు నుండి ప్రారంభించారు. పట్టణ పరిధిలోని ప్రజలెవరికైనా స్పర్శలేని మచ్చలుకాని కాళ్ళు, చేతులు తిమ్మిర్లు ఉండటం కాని కనురెప్పలు మూతపడకపోవడం కాని, చెవులు వాపు, బుడిపెలు, కాళ్ళు చేతులు పట్టుయివ్వకపోవడం వుంటే మీ దగ్గరలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పరీక్ష చేయించుకోవచ్చునన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉన్నట్లయితే అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో యండిటి చికిత్స పూర్తిగా ఉచితంగా యివ్వబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గజ్జెలవారిచెరువు వైద్యాధికారి సిబ్బంది, హెచ్ఈఓ కె . సత్యానందం, డిపియంఓ కె. సత్యనారాయణ , బాలకృష్ణ, యంపిహెచ్ఇన్ సాగర్ పాల్గొన్నారు.

3 నుంచి కళ్యాణోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - మామిడికుదురు : ఈ నెల మూడవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు మాకనపాలెం గ్రామంలో శ్రీ అనంత లక్ష్మీ భూదేవీ సమేత శ్రీశ్రీశ్రీ సత్యనారాయణ స్వామి వారి 71వ దివ్య తిరు కళ్యాణోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ రాత్రి 9 గంటలకు శ్రీ పద్మావతి కళ్యాణం, కాదంబరి కంజరి కథ, 4వ తేదీ రాత్రి 10 గంటలకు భరత నాట్యం, 5వ తేదీ రాత్రి 10 గంటలకు శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం నాటకం, 6వ తేదీ రాత్రి 10 గంటలకు శ్రీ రామాంజనేయ యుద్ధ నాటకం 7 తేదీ ఉదయం 10 గంటలకు అన్న సమారాధన, రాత్రి 10 గంటలకు బాల నాగమ్మ నాటకం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వెంకన్న కళ్యాణోత్సవాలకు ముహూర్తపు రాట

విశాలాంధ్ర - అమలాపురం : పెళ్లిళ్ల వెంకన్నగా ఖ్యాతికెక్కిన అమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈనెల 28నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆలయం వద్ద ముహూర్తపు రాట పాతారు. మార్చి నెల 28వ తేదీన స్వామివారిని పెళ్లి కుమారుడిని చేయడంతో మొదలయ్యే కల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 8న శ్రీ తెప్పోత్సవం వరకూ 12 రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ చైర్పెర్సన్ దూడల విరీతదేవి ఫణి తెలిపారు. కొత్త పాలకవర్గం ఈ ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి ప్రోత్సాహకర్త యెందురి నాగేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు యెందురి రాఘవ, నడింపల్లి వర్మ, సంసాని అబ్బు, కుసుమ శ్రీను, ముంగర ప్రసాద్, కాశే ఆది పట్టాభిరామయ్య, బరణికాన బాబు, ఈఓ డి. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం ప్రారంభోత్సవంలో దాట్ల సుబ్బరాజు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు పంచాయతీ రంగనాయక పురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముమ్మిడివరం నియోజకవర్గం ఇన్‌చార్జి దాట్ల సుబ్బరాజు, ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళి పూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, రామకృష్ణంరాజు, వాశంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సీతానగరం : మృతుడి కుటుంబానికి సీపీఐ ఎమ్ ఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని చినకొండేపూడి గ్రామానికి చెందిన ఎం. నాని కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారనే విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న మండల మహిళా అధ్యక్షురాలు పలివెల వీరబాబు జ్యోతి దంపతులు మృతుని కుటుంబానికి ధైర్యం చెప్పి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చిట్టి స్వామి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

భాష్యం రామకృష్ణ జన్మదినం

విశాలాంధ్ర-దేవరపల్లి: భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ జన్మదిన సందర్భంగా దేవరపల్లి భాష్యం స్కూల్ విద్యార్థులు మండలం లోని గొల్లగూడెం భారతి వికలాంగుల ఆశ్రమానికి వెళ్లి వృద్ధులకు పండ్లు, బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కాగిత భాస్కరరావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి. పేరయ్య నాయుడు, చాంప్స్ ప్రిన్సిపాల్ షబానా, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - అనపర్తి : కోట్లాది రూపాయల వ్యయంతో అనపర్తి మండలం రామవరం లో నిర్మించే కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మండపేట మెహర్ ఆయిల్ ఇండస్ట్రీస్ చైర్మన్ చింతా రామకృష్ణారెడ్డి వీరలక్ష్మి దంపతులు శంకుస్థాపన చేశారు. బుధవారం ప్రముఖ పారిశ్రామికవేత్త, రామచంద్ర పేపర్ మిల్ (ఏడిద) అధినేత మేడపాటి రామలింగారెడ్డి పర్యవేక్షణలో ప్రముఖ వేద పండితులు మిక్కిలినేని దుర్గయ్య శాస్త్రి ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డి దంపతులతో గణపతి హెూమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనగా కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా మేడపాటి రామలింగారెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అత్యాధునికంగా కొట్లాది రూపాయలతో నిర్మించనున్నట్లు తెలిపారు. రామవరం గ్రామాన్ని ఆధ్యాత్మిక గ్రామంగా తీర్చేదిద్దాలనే వాంఛతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

ప్రిన్సిపల్ సాల్మన్ రాజు సస్పెన్షన్

విశాలాంధ్ర-పెడన: పెడన పట్టణంలో బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాల్మన్ రాజు వ్యవహార సరళి పలు వివాదాలకు తావిస్తోంది. ఇటీవల పట్టణంలో పెద్ద పెద్ద వృక్షాలు కొట్టి సొమ్ము చేసుకోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగింది.తాజాగా బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సరైన వసతులు లేవని ఆర్.ఐ.ఓ కు లేఖ రాయడం వివాదాస్పదమైంది. కళాశాల విద్యా కమిటీకి తెలియకుండా తోటి అధ్యాపకులకు ఏమాత్రం చెప్పకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని పట్టణంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాల్మన్ రాజును ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఎంవీ శేషగిరి బాబు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సాల్మన్ రాజు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గత ఏడాది ఆగస్టు 29వ తేదీన కళాశాల సివిక్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న కే రాజ్యలక్ష్మి భర్త సతీష్ కుమార్ పై మచిలీపట్నం చిలకలపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 2న ఈ ఫిర్యాదు పై డిఐఈఓ బొడ్డు ప్రసాద్ నిర్వహించిన విచారణకు సాల్మన్ రాజు గైర్హాజరయ్యారు. పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు పై ఉన్నతాధికారులకు తెలియజేయకపోవడం ఈ ఫిర్యాదు పై నిర్వహించిన విచారణకు హాజరు కాకపోవడం సి. సి రూల్స్ కి వ్యతిరేకం. దీంతో సాల్మన్ రాజు ను కమిషనర్ సస్పెండ్ చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొవ్వూరు :కొవ్వూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్లానింగ్ కమీషన్ సెక్రటరీ విజయ్ కుమార్ (ఐఎస్) కు తెలిపామని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యామ్ రవి ప్రకాష్ పేర్కొన్నారు. మంగళ వారం రాజమండ్రి మంజీర హెూటల్‌లో రాష్ట్ర ప్లానింగ్ కమీషన్ సెక్రటరీ విజయకుమార్ అధ్యక్షత న జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కొవ్వూరు హాస్పిటల్‌కు పేషెంట్లు వెళ్తుంటే కొంతమంది ని రాజమహేంద్రవరం హాస్పిటల్ కి రిఫర్ చేస్తున్నారని వారు అక్కడ నుంచి కాకినాడకు రిఫర్ చేయడం ద్వారా పేషేంట్లు నానా ఇబ్బందులు పడుతున్నారుని తెలిపారు కొవ్వూరు లో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి హాస్పటల్ భవన నిర్మాణం జరిగిందని తగిన సిబ్బంది లేక ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నరని తెలిపారు. సుమారుగా2600 వ్యాధులను ఆరోగ్యశ్రీ లో చేర్చినప్పటికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి ఆదేశాల మేరకు ప్రజలకు విద్య వైద్యం ఆరోగ్యం అందించవలసిన ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చోళ్ళ రాజు, దిద్దే రాజు పాల్గొన్నారు.

మార్చి 17 నుంచి మెడికల్ ఉపకరణాల ట్రేడ్ ఫెయిర్ మెడీకాల్ ఎక్స్ పో

విశాలాంధ్ర-రాజమండ్రి : మెడ్ ఎక్స్పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే అతిపెద్ద బీ2బీ మెడికల్ ఉపకరణాల ట్రేడ్ ఫెయిర్ అయిన మెడీకాల్ మార్చి 17 నుండి 19 వరకు హైదరాబాద్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరగనుందని మెడీకాల్ వ్యవస్థాపకులు ఎస్ మణివణ్ణన్ అన్నారు. ఈ మెడీకాల్ 32వ ఎడిషన్ సర్జికల్ కాటన్ నుండి అధునాతన ఇమేజింగ్ పరికరాలు, శస్త్రచికిత్సా ఉపకరణాల వరకు ఆసుపత్రిలోని అన్ని అవసరాలపై దృష్టి పెడుతుందన్నారు. మెడీకాల్ వారు షోస్టాపర్ అయిన ఒక ఇంటరాక్టివ్ బ్రెయిన్ స్టార్మ్ కూడా నిర్వహిస్తున్నారన్నారు. మెడీకాల్ లో, వైద్యం నిర్వహణ కలిసి మేధోపరంగా ఉత్తేజపరిచే సెమినార్లు, వర్క్ వర్క్ షాప్ లు, అన్నాన్ఫరెన్స్ లు, ఆసుపత్రులని నడపడంలోని వ్యాపార అంశాలపై పరిజ్ఞానాన్ని పొందడానికి, వ్యాప్తి చేయడానికి మెడికల్ ఫ్రైటర్నిటీ కోసం ఓపెన్ డిస్కషన్ సెషన్లని అందిస్తుందన్నారు. మెడీకాల్ బ్రెయిన్టెర్మ్ లోని ఇంటరాక్టివ్ హెల్త్ కేర్ ఇంటెలిజెంట్సియా క్లుప్తంగా జ్ఞానాన్ని అందిస్తుందన్నారు.

గ్రామ వలంటీర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం వార్డు వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేసి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు కోరారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో గల వీర వెంకట సత్యనారాయణ కళ్యాణ మంటపంలో స్థానిక ఎంపీపీ మేడిసెట్టి సత్య వేణి దుర్గారావు అధ్యక్షతన మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో ఎమ్ఎల్‌సీ తోట ప్రసంగించారు. 2024వ సంవత్సరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు గృహసారథుల సారథ్యంలో అధికారం హస్తగతం చేసుకుంటుందని తోట ధీమా వ్యక్తంచేశారు. వార్డు వా లెంటీర్లు, గృహ సారథులకు ఏ సమస్య వున్నా నేరుగా తన దృష్టికి తీసుకొని రావాలని తోట కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఆర్ బి కే సలహా కమిటీ చైర్మన్ పుట్టా కృష్ణబాబు, మండల వైసీపీ కన్వీనర్ శీలం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పుర వీధులలో సింహ వాహనంపై శ్రీవారు

విశాలాంధ్ర - రావులపాలెం : 14వ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు సింహ వాహనంపై వేంచేసి పుర వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాదాచార్యులు, వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు వార్ల బ్రహ్మత్వంలో ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం సరస్వతి హెూమం ఘనంగా నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలతో శ్రీ శ్రీనివాస శరణాగతి గోవింద మాలధారులతో గోవింద నామస్మరణలతో భజన, కోలాట బృందాలతో రామడోలు వాయిద్యాలతో, కేరళ వాయిద్యాలతో, భక్తజన సందోహం నడుమ, భగవన్నామ స్మరణలతో అత్యంత వైభవంగా గ్రామ పుర వీధులలో సింహ వాహనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి ముత్యాల పందిరిపై పుర వీధుల్లో అంగరంగ వైభవంగా స్వామి వారు విహరించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామిని దర్శించుకోవడం వల్ల సమస్త కార్యసిద్ధి మనశాంతి కలుగుతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, పదాల బాపిరెడ్డి, మేడపాటి సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముదిరిన నకిలీ పత్రాల వ్యవహారం

ఒకరి ఆత్మహత్యాయత్నం : సమగ్ర విచారణకు డిమాండ్

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో రెవిన్యూశాఖ ద్వారా జారీ అయిన నకిలీ ధృవపత్రాల వ్యవహారం ముదిరి, ఒకరి ఆత్మహత్యాయత్నానికి దారి తీసింది. గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న ఈ తంతుపై సమగ్ర విచారణ చేపట్టాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది. వివరాల్లోకి వెళితే...విస్సన్నపేట ఎస్సీవాడకు చెందిన నందిపాం దానియేలు అనే రైతు తాను సాగు చేస్తున్న భూమిని ఆన్‌లైన్ చేయాలని తన వద్ద ఉన్న పత్రాలతో రెవిన్యూ అధికారులను సంప్రదించారు. ఇది జాప్యం జరగటంతో కొందరు గ్రామ పెద్దల ద్వారా అధికారులపై ఒత్తిడి తేవటంతో దానియేలు వద్ద ఉన్నవి నకిలీ పత్రాలుగా అధికారులు నిర్ధారించటంతోపాటు, పోలీసుశాఖను విచారించాలని కోరారు. ఈ విషయం మంగళవారం 'విశాలాంధ్ర' దినపత్రికలో 'నకిలీ ధృవపత్రాల కలకలం' అనే శీర్షికతో వార్త ప్రచురితమయ్యింది. ఈలోగా పోలీసులు విచారణ పేరుతో తనను పిలిచారని, సంబంధిత భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ కోసం రూ.1.5లక్షలు ఖర్చు చేయగా, అధికారులు న్యాయం చేయకపోగా తన వద్ద ఉన్న కాగితాలు నకిలీవిగా ధృవీకరించి, పోలీసులకు ఫిర్యాదు చేశారనే ఆవేదనతో దానియేలు మంగళవారం పురుగుమందు సేవించి, ఆత్మహత్యాయత్నం చేశారు. గుర్తించిన కుటుంబసభ్యులు క్షతగాత్రుడిని విజయవాడ తరలించి, వైద్యసేవలందిస్తున్నారు. ఇదే శాఖలో గతంలో నకిలీ పొజిషన్ ధృవీకరణలతో కొందరు ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రయత్నం చేయటం, ఇది వివాదానికి దారి తీసి, పోలీసులకు ఫిర్యాదు చేసుకోవటం జరిగింది. మరికొందరు న్యాయస్థానాలను ఆశ్రయించగా, విచారణ కొనసాగుతోంది.

సామరస్య పూర్వంగా ప్రజలకు పోలీసులు సేవలు అందించాలి

విశాలాంధ్ర - గుడివాడ : ప్రజలతో మమేకమవుతూ సామరస్య పూర్వకంగా పోలీస్ సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించిన జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. బుధవారం స్థానిక గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డిఎస్పి సత్యానందంతో కలసి జిల్లా ఎస్పీ జాషువా అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గుడివాడలో డిఎస్పి సత్యానందం పర్యవేక్షణలో పోలీస్ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎక్కువగా భార్య, భర్తల మధ్య ఎక్కువగా సమస్యలు ఏర్పాడం జరుగుతునయన్నారు. వారికి ప్రతేకంగా కౌన్సింగ్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళా పోలీసులు అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలీసులకు అవసరమైన విలువైన సమాచారాన్ని అందించడంలో మహిళా పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐలు జయకుమార్, గోవిందరాజులు, తులసీదర్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.